## కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో.. ) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చ కాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 10, క్యారెట్ 18, దొండ 23, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 21, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 75, సొరకాయ 18, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## రూ. 99.25 కోట్లు ఆస్తిపన్ను వసూలు

**సనత్‌నగర్:** 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను బేగంపేట సర్కిల్‌లో ఆస్తి పన్ను రికార్డు స్థాయిలో వసూలైంది. మొత్తం వంద కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా దానికి చేరువలో 99.25 కోట్లు వసూలైంది. గత ఏడాది రూ.98.20 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది అదనంగా ఒక కోటి రూపాయలు వసూలు కావడం విశేషం. లక్ష్యాన్ని చేరువయ్యేందుకు గత నెల రోజులుగా ప్రాపర్టీ ట్యాక్స్ అధికారులతో పాటు వివిధ విభాగాల అధికారులు ఆస్తి పన్ను వసూలు పైనే దృష్టి పెట్టారు. మొండి బకాయిల విషయంలో సీరియస్‌గా వ్యవహరించారు. డిమాండ్ నోటీసులు, రెడ్ నోటీసులు, వారెంట్ల ద్వారా ఆస్తి పన్ను బకాయిదారులకు హెచ్చరికలు జారీ చేస్తూ వచ్చారు. దీంతో బకాయిదారులు దిగిరాక తప్పలేదు. మొత్తం మీద 100 కోట్లకు చేరువగా ఆస్తి పన్ను వసూళ్లు చేసి ఈ ఏడాది రికార్డు సృష్టించారు.

## బేగంపేట సర్కిల్ ఇన్‌చార్జి డీసీగా డాకూనాయక్..

**సనత్‌నగర్:** జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌గా డాకూనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు బేగంపేట సర్కిల్ డీసీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు బేగంపేట సర్కిల్ డీసీగా పనిచేసిన సమ్మయ్యను జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీగా బదిలీ చేసిన విషయం విదితమే.

## రైల్వే ఉద్యోగి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత



మణెమ్మకు చెక్కును అందిస్తున్న సీసీఎస్ ఛైర్మన్, డైరెక్టర్లు

**సికింద్రాబాద్:** మృతి చెందిన రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి తెలిపారు. బుధవారం మృతి చెందిన రైల్వే ఉద్యోగి విజయ్‌కుమార్ ఖాతాను సీసీఎస్ పాలకమండలి సెటిల్ చేసింది. విజయ్‌కుమార్ తీసుకున్న రూ.7లక్షల వివిధ రుణాలను మాఫీ చేసినట్టు స్వామి తెలిపారు. ఇదిలా ఉండగా అతని వాటాధనం రూ.2.23 లక్షల చెక్కును ఆయన భార్య మణెమ్మకు అందించినట్టు చిలుకు స్వామి తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ కార్యదర్శి రవిశంకర్, డైరెక్టర్లు అంజయ్య, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఓయూ దూరవిద్య ప్రవేశాలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ దూరవిద్య కోర్సుల ప్రవేశాలు ముగిశాయి. 2025-26 విద్యా సంవత్సరానికి రెండు విడతలుగా జరిగిన కౌన్సెలింగ్‌లో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సులు సుమారు 8000 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

## కమ్యూనిటీ హాళ్లను ఉపయోగించుకోవాలి



అన్నదానం చేస్తున్న కోట నీలిమ

**అమీర్‌పేట:** కాలనీలు, బస్తీల్లో ఉండే కమ్యూనిటీ హాళ్ల సామాజిక సేవా, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట డివిజన్ బీజేఆర్‌నగర్-1లోని కమ్యూనిటీ హాల్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. మరమ్మత్తుల కోసం జీహెచ్‌ఎంసీ నిధుల నుండి రూ.12.50 లక్షలు మంజూరు కాగా పనులు పూర్తి అయినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎస్.ఎస్.రావు,కటకం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి ప్రజాస్వామ్యంపై గౌరవం లేదు

ఎమ్మెల్యే శ్రీగణేశ్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత తదితరులు

**కంటోన్మెంట్:** బీజేపీకి ప్రజాస్వామ్యంపై ఏమాత్రం గౌరవం లేదని ఎమ్మెల్యే శ్రీగణేశ్ విమర్శించారు. పదేళ్లుగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలో చేపట్టిన 'జై బాపూ- జై భీం- జై సంవిధాన్ అభియాన్' ర్యాలీని నియోజకవర్గ కోఆర్డినేటర్, ఆర్యవైశ్య ఛైర్ పర్సన్ కాల్వ సుజాతతో కలిసి ప్రారంభించారు. తొలుత బాపూజీ నగర్ లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అటు నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో పాదయాత్రగా బోయిన్ పల్లి చౌరస్తా వరకు చేరుకుని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ బీజేపీ విధానాలు రాజ్యాంగ, దళిత వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం కంటోన్మెంట్ వ్యాప్తంగా చేపడుతామని కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటిఇంటికి వెళ్లి ప్రజలను చైతన్యపరుస్తారని ఎమ్మెల్యే అన్నారు.

# సీతారాముల కల్యాణానికి రండి



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

**సనత్‌నగర్:** ఈ నెల 6వ తేదీన నిర్వహించే శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవానికి రావాలంటూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానాలు అందాయి. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను పలు ఆలయాల అధికారులు కలిసి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అమీర్‌పేటలోని కుమ్మరిబస్తీలో గల హనుమాన్ దేవాలయం ఈఓ జయంతి, పద్మారావునగర్‌లోని పోల్‌బాల్ హనుమాన్, ముషీరాబాద్ సర్కిల్‌లోని శ్రీసీతారామచంద్ర దేవాలయ ఈఓ సత్యమూర్తిలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానపత్రికలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్‌లు రాజేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు వెంకటేషన్‌రాజు, నాయకులు మహేందర్‌గౌడ్, అమృత, కౌసల్య, కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూలో రాహుల్ గాంధీ చిత్రపటం దహనం



ఓయూలో రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న విద్యార్థులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిరసిస్తూ ఓయూలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. బుధవారం ఓయూ పాలన భవనం ఎదుట బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలని, ఓయూలో విధించిన నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు బొల్లు నాగరాజుయాదవ్, శ్రీమాన్‌గౌడ్, నాగేందర్ రావు, అవినాష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్నకు ఘన నివాళి



సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

**సికింద్రాబాద్:** సీతాఫల్‌మండి డివిజన్ అంబేడ్కర్ కూడలిలో బుధవారం సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నగర నాయకుడు ఆకారం రమేశ్ నేతృత్వంలో నిర్వహించిన వేడుకల్లో మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్ గౌడ్, మేకల సారంగపాణి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు కందాడి నాగేశ్వర్‌రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, భాస్కర్‌గిరి, శారదా మల్లేశ్, మేకల కీర్తి హర్షకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న వెల్లాల రామ్మోహన్..

**సనత్‌నగర్:** నిరుపేదలను, బడుగులను పీడించే పాలకుల గుండెల్లో దడ పుట్టించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని బీజేప సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని బల్కంపేట రోడ్డులోని పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. సుబ్బారావు, శ్రీకాంత్ యాదవ్, చారి, రవిచంద్ర, హరిబాబు, చైతన్య పాల్గొన్నారు.

## జనాభా దామాషా ప్రకారం మంత్రి పదవులు ఇవ్వాలి

**లాలాపేట:** మాదిగలకు జనాభా దామాషా ప్రకారం రెండు మంత్రి పదవులు ఇవ్వాలని దక్షిణాది జేఏసీ చైర్మెన్ ప్రొ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ బుధవారం తార్నాకలోని డిజాక్ కార్యాలయంలో బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో చేపట్టబోయే మంత్రి వర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గం నుంచి ఉన్న ఆరుగురు ఎమ్మెల్యేల్లో ఇద్దరికి మంత్రిగా అవకాశం కల్పించాలన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జి దారుణం

**ఉస్మానియా యూనివర్సిటీ:** హెచ్‌సీయూలో విద్యార్థుల పై జరిగిన లాఠీఛార్జిని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఖండించారు. బుధవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ భూములను కాపాడుకునేందుకు శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టడం దారుణమన్నారు. సెంట్రల్ వర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించిన రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, మల్లుబట్టి విక్రమార్కకు హెచ్‌సీయూ పై ప్రేమ లేదన్నారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యార్థుల పై పెట్టిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## జలమండలి ఉద్యోగిపై గుర్తుతెలియని వ్యక్తి దాడి

**చిలకలగూడ:** జలమండలి సీతాఫల్‌మండి సెక్షన్ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు. చిలకలగూడ పోలీసులు, జలమండలి కార్మిక నాయకులు తెలిపిన మేరకు.. వాటర్‌వర్క్స్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న జీ శ్రీనివాస్ బుధవారం వేకువజాము 3 గంటల సమయంలో చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద మంచినీటి సరఫరా జరిగే వాల్ విప్పుతున్నాడు. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి అక్కడికి వచ్చి సిగరెట్ ఉందా అని అడిగాడు, లేదని చెప్పడంతో పరుష పదజాలంతో దూషించాడు.అనంతరం శ్రీనివాస్‌పై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేశారు.

## బాలుడి అదృశ్యం



నవీన్

**చిలకలగూడ:** స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన మేరకు.. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావికి చెందిన పోచయ్య అలియాస్ నవీన్ (11) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. గతనెల 31న స్నేహితులతో ఆడుకునేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తండ్రి నాగరాజు బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ తెలిపారు,

# ఆటిజం బాధితులకు సహకరించాలి

దివ్యాంగ్జన్ డైరెక్టర్ రామ్ కుమార్

**కంటోన్మెంట్:** ఆటిజం పట్ల సరైన అవగాహనతోనే బాధితులకు తగిన సహకారం అందించడం సాధ్యం అవుతుందని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటీస్' (ఎన్‌ఐఈపీఐడీ - దివ్యాంగ్జన్) డైరెక్టర్ బీవీ రామ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగ్జన్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి దివ్యాంగ్జన్ ఆవరణ నుంచి బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగులను సాధారణ జనజీవన స్రవంతిలోకి తీసుకురావడమే లక్ష్యంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆటిజం అవగాహన ర్యాలీలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

# పిన్న వయసులోనే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



బేబి వియోనాకు రికార్డు ధృవీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

**లాలాపేట:** అతి పిన్న వయస్సులోనే అసాధారణమైన మేధస్సుతో బేబి వియోనా తుమ్మల గుల్లె తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన సుమన్ తుమ్మల, రేఖ గుల్లె దంపతులు 19 నెలల చిన్నారి బేబి తన అసాధారణమైన మేధస్సులో 50 వరకు ప్రపంచ దేశాల జెండాలను గుర్తించడం, 70 రకాలైన వేరు వేరు వస్తువుల పేర్లను స్పష్టంగా చెబుతూ ఆశ్చర్యపరుస్తోంది. బుధవారం లాలాపేటలోని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. చింతపట్ల వెంకటాచారి బేబి వియోనా(వర్చువల్) మేధా శక్తిని పరీక్షించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆ బేబికి చోటు కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

## 'హెచ్‌సీయూ విషయంలో హైడ్రా నిద్రపోతోందా..?'

**లిబర్టీ:** హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమి కబ్జాకు గురవుతుంటే, రాష్ట్రంలో చెరువులు కాపాడుతానని ప్రతిజ్ఞ బూనిన హైడ్రా రంగనాథ్ ఏం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రశ్నించారు. 400 ఎకరాల అడవితో పాటు మూడు చెరువులు పీకాక్ లేక్, బఫెల్లో లేక్, క్రే లేక్‌లు ఉన్నాయని అంటే ఈ భూమి బఫర్ జోన్‌లోకి వస్తాయని, అంగుళం స్థలం కూడా బఫర్ జోన్‌లో ఉంటే వదలం అని చెప్పే రంగనాథ్ ఏం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి నిర్ణయానికి రావాలన్నారు.

## మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

**పంజగుట్ట:** మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలని సీనియర్ నాయకత్వ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అల్లారం రత్నయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్షులు లింగాల పెద్దయ్య, స్వామిదాస్, బాల్‌రాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మాదిగ ఉప కులానికి మంత్రి పదవి ఉంది.. కానీ 33 లక్షల జనాభా ఉన్న మాదిగలకు మంత్రివర్గంలో స్థానం లేకపోవడం బాధాకరమన్నారు. ఇదే డిమాండ్‌పై ఈనెల 5న ఇందిరాపార్క్ వద్ద దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. తమ సంఘానికి అనుబంధ సంఘాలైన యువజన, మహిళా, విద్యార్థి సంఘాలు సైతం ఒక్కోరోజు ఒక్కొక్కరు దీక్ష చేపడతారని పేర్కొన్నారు.

# 13న మున్నూరు కాపు గర్జన సన్నాహక సమావేశం



అభివాదం చేస్తున్న మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు

**పంజగుట్ట:** ఈనెల 13న నెక్లెస్ రోడ్డు జలవిహార్‌లో మున్నూరు కాపు గర్జన సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ తెలిపారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కాపుల గర్జన సన్నాహక కమిటీ కో ఆర్డినేటర్లు పూటం పురుషోత్తం పటేల్, కొత్త లక్ష్మణ్, చందు జనార్దన్ పటేల్, సామల వేణుతో కలిసి మాట్లాడుతూ.. కాపులు, మున్నూరు కాపులు కలిస్తే సుమారు 60 లక్షల వరకు తమ జనాభా ఉందని కానీ ఇటీవల చేపట్టిన సర్వేలో కేవలం 13 లక్షలు ఉన్నట్లు, బీసీల్లో ఐదో స్థానంలో చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేమెంతో ప్రజలు, పాలకుల దృష్టికి తీసుకువచ్చేందుకు మే నెలలో 10 లక్షల మందితో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మున్నూరు కాపు గర్జన చేపడుతున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశానికి అన్ని పార్టీల నుంచి మున్నూరు కాపు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అన్ని సంఘాల ప్రధాన నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో మణికొండ వెంకటేశ్వర్లు, ఎడ్ల రవి, బండి పద్మ, బండి సంజీవ, వనమాల ప్రవీణ్, మంగళారపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల విక్రయాన్ని విరమించుకోవాలి



మాట్లాడుతున్న మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**హిమాయత్‌నగర్ :** హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని ప్రభుత్వం మానుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ రాజ్ బహదూర్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అమ్మకం పెట్టిన భూములను యూనివర్సిటీ అవసరాల కోసం ఉపయోగించాలన్నారు. యూనివర్సిటీ నుంచి తక్షణమే పోలీస్ బలగాలను వెనక్కి పిలవాలన్నారు. అలాగే యూనివర్సిటీ పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, అరుణ్, హరీశ్, సందీప్, కృష్ణ, సాయి, వెంకటేశ్, శ్రావణి, ఆకాశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ సట్టా బెట్టింగ్ గ్యాంగ్ అరెస్ట్

- రూ. 1.07 లక్షల నగదు, రూ.4 లక్షల పరికరాలు స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితుడు.. రిమాండ్‌కు ఐదుగురు ముఠా సభ్యులు




పోలీసులు అరెస్ట్ చేసిన ఇంటర్‌స్టేట్ సట్టా గ్యాంగ్, స్వాధీనం చేసుకున్న నగదు, కంప్యూటర్లు, ప్రింటర్లు

**చిలకలగూడ:** ఆన్‌లైన్‌లో సట్టా నిర్వహిస్తున్న ఇంటర్‌స్టేట్ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. వరంగల్ హసన్‌పర్తికి చెందిన ఎలదండి రాజేందర్ మూడేళ్ల క్రితం సికింద్రాబాద్ చిలకలగూడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని స్థానికంగా నివసించే బంధువు సహకారంతో ల్యాప్‌టాప్, ప్రింటర్లు, సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్ తదితర సట్టా నిర్వహించేందుకు అవసరమైన సామాగ్రి సిద్ధం చేసుకున్నాడు. వరంగల్, కేసముద్రం పెగడపల్లి ప్రాంతాలకు చెందిన పెనుగొండ సదాశివుడు(32), ఎలుగు కార్తీక్ (23), తల్లపల్లి పున్నంచంద్రగౌడ్ (26), సికింద్రాబాద్ ఆల్వాల్ వాసి మాడిశెట్టి యాదగిరి (40) మహారాష్ట్ర యావత్మాల్, వాణి ప్రాంతానికి చెందిన ఫైజన్‌ఖాన్ (25)లతో ముఠాగా ఏర్పడ్డారు. వీరికి నెలవారీ వేతనం చెల్లించేలా ఒప్పందం కుదర్చు కున్నాడు. మొబైల్‌ఫోన్లు, వాట్సప్ మెసేజ్‌ల ద్వారా తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి సట్టా బెట్టింగ్‌లు స్వీకరించి, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యుపీఐల ద్వారా డైరక్టుగా బ్యాంకు ఖాతాలోకి డబ్బును జమ చేసేవారు. తమకు తెలిసినవారికి ఫోన్లు చేసి సట్టా ఆడేలా ప్రోత్సహించేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, చిలకలగూడ పోలీసులు సంయుక్తంగా ఈనెల 1న దాడులు చేసి నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి రూ. 1,07,200 నగదు, రూ. 4 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ప్రింటర్లు, కాలిక్యులేటర్లు, సట్టా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సదాశివుడు, కార్తీక్, పున్నంచంద్రగౌడ్, యాదగిరి, ఫైజన్‌ఖాన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఎలదండి రాజేందర్ కోసం గాలిస్తున్నారు.

# రాజీవ్ యువ వికాసం @ 6 కేంద్రాలు

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు • ఈ నెల 14 వరకు అందించేందుకు అవకాశం



ఖైరతాబాద్ జోనల్ ఆఫీసులోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ దరఖాస్తుల స్వీకరణ కేంద్రం

**బంజారాహిల్స్:** రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణకు అధికారులు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో గల జూబ్లీహిల్స్ సర్కిల్-18 కార్యాలయంలో, అలాగే బంజారాహిల్స్ డివిజన్ కేంద్రాన్ని బంజారాహిల్స్ రోడ్డునంబర్-12 లోని సీఎండీసీ, జూబ్లీహిల్స్ డివిజన్ కేంద్రాన్ని జూబ్లీహిల్స్ క్లబ్ ఎదుట ఉన్న వార్డు కార్యాలయంలో, షేక్‌పేట్ డివిజన్‌కు సంబంధించి షేక్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో, ఖైరతాబాద్ డివిజన్‌కు సంబంధించి ఖైరతాబాద్ వార్డు ఆఫీస్, సోమాజీగూడ డివిజన్‌కు సంబంధించి సోమాజీగూడ వార్డు కార్యాలయంలో సెంటర్లను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఆయా కౌంటర్లలో సిబ్బందిని సైతం ప్రత్యేకంగా నియమించారు. ఈనెల 14 వరకు దరఖాస్తులు అందజేయవచ్చని, అప్పటివరకు కౌంటర్లు తెరిచి ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. యూసీడీ విభాగంలో పనిచేసే రీసోర్స్ పర్సన్లు అర్జీలు స్వీకరించి ప్రతిరోజూ వచ్చిన దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్లకు అందజేస్తారు. గడువు ముగిసిన తర్వాత కమిటీలు ఏర్పాటుచేసి దరఖాస్తులు పరిశీలిస్తారు.

**అన్ని కులాల వారికి స్వయం ఉపాధి..**

రాజీవ్ యువ వికాస పథకంలో భాగంగా అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.4 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. దీనిలో సుమారు 60 నుంచి 80 శాతం సబ్సిడీ కూడా ఇవ్వనున్నారు.

**దరఖాస్తుకు జతపర్చాల్సినవి..**

- ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- ఇన్‌కాం సర్టిఫికెట్ ఏప్రిల్ 2024 నుంచి లేటెస్ట్‌గా ఉండాలి
- పాన్‌కార్డు, దరఖాస్తుదారుడి ఫొటో, మొబైల్ నంబర్
- రేషన్‌కార్డులోని సభ్యుల్లో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుంది.

**ఉపాధి అవకాశాలు..**

పంపుసెట్లు, ఎయిర్ కంప్రెషన్, గేదెలు, ఆవులు, చేపలు, పాల వ్యాపారం, పౌల్ట్రీఫారం, బేకరీ, హెయిర్ కటింగ్ షాపు, బ్యూటీ పార్లర్, ఎలక్ట్రిక్ షాపు, డిష్ టీవీల ఏర్పాటు, జనరల్ స్టోర్, పండ్ల దుకాణం, గిఫ్ట్ ఆర్టికల్ షాపు, ఐస్‌క్రీం పార్లర్, హోటల్, మినీ సూపర్ బజార్, చీరల వ్యాపారం, స్వీట్ షాపు..ఇలా 75 రకాల షాపుల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో భాగంగా 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల రుణాలను 60-80 శాతం వరకు రాయితీతో అందించనున్నారు.